క్లుప్తంగా

నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

చిత్తూరు కలెక్టరేట్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఈ నెల 09 వ తేదీన నిర్వహించనున్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంకు గిరిజన సంక్షేమ సంఘాలు, గిరిజనులు, ప్రజలు పాల్గొనాలని అధికారులు సూచించారు.

అర్ధగిరి హుండీ ఆదాయం రూ.17.63 లక్షలు


హుండీలోని కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

తవణంపల్లె: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి ఆలయానికి హుండీలోని కానుకల ద్వారా రూ.17,63,301 ఆదాయం వచ్చినట్టు ఈవో టీ.హనుమంతరావు తెలిపారు. ఆలయ మండపంలో గురువారం ఎండోమెంట్ అధికారి మునిరాజులు, ఆలయ ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ సురేంద్రరెడ్డి పర్యవేక్షణలో హుండీలోని కానుకలను లెక్కించారు. 11 గ్రాముల బంగారు, 386.500 గ్రాముల వెండి, 67యూఎస్ డాలర్లు, 15 సౌదీ రియల్, 14 కువైట్ దీనార్లు వచ్చినట్లు వివరించారు. 135 రోజులకు గాను రూ.17,63,301 ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో అరగొండ సప్తగిరి బ్యాంక్, సచివాలయ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్ట్‌మన్ సస్పెన్షన్

చిత్తూరు కార్పొరేషన్: గుడిపాల పాపిశెట్టిపల్లె పోస్ట్‌మన్ శ్యాంసుందర్‌ను సస్పెండ్ చేసినట్లు సూపరింటెండెంట్ లక్ష్మణ్ తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా చర్యలు తీసుకున్నామన్నారు. వినియోగదారులకు పోస్టల్ డెలివరీలు చేయనందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుదాం


మాట్లాడుతున్న కాపు రామచంద్రారెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: జాతీయ జెండాను ప్రతి ఇంటిపైనా ఎగురవేసి దేశభక్తిని చాటుదామని బీజేపీ హర్‌ఘర్ తిరంగా కార్యక్రమ రాయలసీమ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా వారం రోజులపాటు వివిధ కార్యక్రమాల్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు, మాజీ ఎంపీ దుర్గ, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరచౌదరి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, చిత్తూరు సెంట్రల్ అధ్యక్షుడు షణ్ముగం, నాయకులు రామభద్ర తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ ఎమ్మెల్యేకు 34 ఫిర్యాదులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్‌నాయుడు నిర్వహిస్తున్న డయల్ యువర్ ఎమ్మెల్యేకు 34 ఫిర్యాదులు అందాయి. గురువారం ఆయన బెంగళూరు నుంచి వర్చువల్ విధానం ద్వారా పాల్గొంటే.. అధికారులు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి కార్యక్రమం నిర్వహించారు. అందిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారించి, పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్పొరేషన్ కమిషనర్ అరుణ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

పలమనేరు: కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా పలు ప్రజాసంఘాలు గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపాయి. అనంతరం నాయకులు ఆర్డీఓ మనోజ్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో దళితులకు పూర్తిగా అన్యాయం జరిగిందని ఆరోపించారు. వ్యవసాయ, కార్మిక, అసంఘటిత రంగాలకు నష్టం జరిగేలా ఉందని, డబ్బున్న వారికి మేలు జరిగేలా కేంద్రం బడ్జెట్‌లో పక్షపాతం చూపిందని దుయ్యబట్టారు. దీనిపై తాము నిరసనలు తీవ్రతరం చేస్తామన్నారు. ఇందులో కేవీపీఎస్, వ్యవసాయ కార్మికసంఘం, ఐద్వా నేతలు ఈశ్వర్, ఓబుల్‌రాజు, భువనేశ్వరి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పాడి ఆవులు




పశువులకు సీజనల్ ముప్పు

- షెడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- డీవార్మింగ్ మందులు వినియోగించాలి
- ఆహారంలో ఫైబర్ ఉండేలా చూడాలి

చిత్తూరు అగ్రికల్చర్: వర్షాకాలంలో పాడి రైతులు పశుసంరక్షణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఏమాత్రం అశ్రద్ధ వహించినా విలువైన పశుసంపదను నష్టపోవాల్సి వస్తుంది. ఈ వాతావరణంలో పాడి పశువులు అనేక రోగాల బారిన ప్రమాదం పొంచి ఉంటుంది. ఎక్కువ సమయం తేమలో గడపాల్సి రావడంతో బ్యాక్టీరియా బారినపడే అవకాశముంది. పశుపోషణలో అప్రమత్తంగా ఉంటే వాటిని వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చని పశుసంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు.

షెడ్ల నిర్వహణ

పశువుల నీడ కోసం నిర్మించిన షెడ్డు నిర్మాణంలో లీకేజీలు లేకుండా చూసుకోవాలి. పశువుల కాలి గిట్టలకు ఎక్కువ సమయం తేమ తగలకుండా చూసుకోవాలి. లేకుంటే గిట్టలు పగిలి గాయాలు ఏర్పడి నడవలేని, నిలబడలేని స్థితికి వస్తాయి. షెడ్డును పరిశుభ్రంగా ఉంచుకోవాలి. షెడ్డులో గాలి, వెలుతురు సక్రమంగా వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

సమతుల ఆహారమే శ్రేయస్కరం

వర్షాకాలంలో పచ్చగడ్డి విస్తారంగా పెరుగుతుంది. పాడి పశువులకు ఇది చాలా మంచిది. మృదువైన పచ్చిగడ్డిని ఎంచుకుని పెద్ద పరిమాణంలో తింటాయి. అయితే ఈ గడ్డిలో చాలా వరకు నీరు, తక్కువ ఫైబర్ (పోషక పదార్థం) ఉంటుందని గమనించాలి. ఇది పాడి పశువులకు మంచిది కాదు. పూర్తిగా పచ్చగడ్డితోనే మేయడం వల్ల తడి సీజన్లలో నీటి పేడ వేయడం సర్వసాధారణం. సరైన జీర్ణక్రియకు ఫైబర్ అవసరం. కాబట్టి పచ్చగడ్డిని సూర్యరశ్మి ఉన్నప్పుడు ఎండ బెట్టడం వల్ల గడ్డిలోని తేమ శాతం తగ్గుతుంది. తర్వాత పశువులకు వేస్తే ఆరోగ్యకరమైన ఆహారంగా ఉపయోగ పడుతుంది.

డీవార్మింగ్ మందులను వినియోగించాలి

తేమ వాతావరణంలో వ్యాధికి కారణమయ్యే బ్యాక్టీరియాలు అనేకం వృద్ధి చెందుతాయి. వాటిలో చెప్పుకోదగిన నులి పురుగులు, పాడి పశువుల్లో అంతర్గత పరాన్న జీవులైన నులి పురుగుల నివారణకు తేమ సీజన్లలో డీ వార్మింగ్ మందులను తరచుగా పాడి పశువులకు తాగించాలి.

దాణా నిల్వ

పశువులకు వాడే దాణా మూటలు తేమ లేని ప్రదేశాల్లో నిల్వ ఉంచుకోవాలి. వాటికి తేమ తగిలితే చెడిపోవడమే కాకుండా బ్యాక్టీరియా వృద్ధి చెంది పశువులకు నష్టం చేకూరుస్తాయి. పశువుల షెడ్డులో నీరు నిల్వ చేరితే అవి జారిపడే అవకాశాలు ఉంటాయి. అందువల్ల నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు వహించాలి.

పొదుగు వాపు వ్యాధి

తేమ సీజన్లలో పొదుగు వ్యాధి ఎక్కువగా కనిపిస్తుంది. ఈవ్యాధి సోకిన పాడి పశువులకు పొదుగు ఉబ్బి పాల ఉత్పత్తి ఆగిపోతుంది.అయితే సాధారణ యాంటీబయాటిక్స్ ఉపయోగించి చికిత్స చేయవచ్చు. ప్రతి రోజు పాడి రైతులు పశువుల పొదుగులను నిశితంగా పరిశీలించాలి. ఏమాత్రం తేడా వచ్చినా పశు వైద్య సిబ్బంది ద్వారా తగిన చికిత్సను అందించాలి.

డీటిక్కింగ్ చేయించాలి

వర్షాకాలంలో పాడి పశువులను పేలు, ఈగలు ఎక్కువ ఇబ్బంది పెడతాయి. కొన్నిసార్లు పశువుల మరణాలకు కూడా కారణమవుతాయి. పశువుల చుట్టూ తిరుగుతూ ఇబ్బంది పెట్టడమే కాకుండా అనేక రకాల రోగాలకు వాహకాలుగా పనిచేస్తాయి. వీటిని నివారించేందుకు పశువులకు డీటిక్కింగ్ చేయించాలి. పాడి పశువులకు ఎక్కువగా పెరిగిన జుట్టును కత్తిరించాలి.

అప్రమత్తంగా ఉండాలి



పాడి రైతులు ప్రస్తుత వర్షాకాలంలో పశు పోషణ పట్ల చాలా అప్రమత్తంగా ఉండాలి. పశువులు ఎలాంటి చిన్న అనారోగ్యానికి గురైనా వెంటనే సమీపంలో పశువైద్యాధికారులను సంప్రదించి, వారి సూచనల మేరకు చికిత్సలు, సూచనలు పాటించాలి. వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా టీకాలు వేయించేందుకు పాడి రైతులు శ్రద్ధ చూపాలి. ప్రతి పశువుకు సమతుల ఆహారం అందించాల్సి ఉంటుంది.

–డాక్టర్ ప్రభాకర్, జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ

ధ్యానంతో భావోద్వేగాల నియంత్రణ


గురుకుల పాఠశాలలో ధ్యానం చేస్తున్న విద్యార్థులు

బంగారుపాళెం: ధ్యాన సాధనతో ఒత్తిడి, భావోద్వేగాలను నియంత్రించవచ్చని సీనియర్ పిరమిడ్ మాస్టర్లు రోహిణి, దాము తెలిపారు. స్థానిక గిరిజన గురుకుల పాఠశాలలో గురువారం కుపాలపల్లె పత్రీజీ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు ధ్యానంపై అవగాహన కల్పించారు. ధ్యాన సాధన–విశిష్టత, ధ్యాన ఆవశ్యకతపై విద్యార్థులకు వివరించారు. వారు మాట్లాడుతూ మానవునిలో ఒత్తిడి, భావోద్వేగాలను తగ్గించుకునేందుకు ధ్యానం మంచి మార్గమన్నారు. అమెరికాలోని పాఠశాలల్లో విద్యార్థుల్లో ఒత్తిడి, భావోద్వేగాలను తగ్గించడానికి ధ్యానం, యోగా, వ్యాయామాలను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. విద్యార్థుల మానసిక స్థితిని గాడిన పెట్టేందుకు అక్కడి ఉపాధ్యాయులు వినూత్నంగా ఆలోచిస్తున్నారని పేర్కొన్నారు. కోవిడ్–19 తర్వాత విద్యార్థుల ఆరోగ్య స్థితిలో మార్పులు వచ్చాయని యూఎస్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ తేల్చిందన్నారు. వారి భావోద్వేగాలకు అనుగుణంగా పాఠశాలల్లో మైండ్ ఫుల్‌నెస్ (యోగా, ధ్యానం)ను ఉపయోగించాలని తెలిపినట్లు వివరించారు.


ధ్యానం ఆవశ్యకతను వివరిస్తున్న మాస్టర్లు రోహిణి, దాము

బిందు సేద్యంపై సబ్సిడీ


మాట్లాడుతున్న ఏడీ

పుంగనూరు: రైతులు నీటిని ఆదా చేసుకునేందుకు బిందు సేద్యంపై అవగాహన పెంచుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని వినియోగించుకోవాలని ఏడీ శివకుమార్ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సన్నకారు రైతులకు 90శాతం సబ్సిడీతో రూ.2.18 లక్షలకు మించకుండా ఆర్థిక సహాయం అందిస్తారన్నారు. అలాగే పెద్ద రైతులకు 70 శాతం సబ్సిడీతో రూ.3.36 లక్షల వరకు సహాయం అందిస్తారని పేర్కొన్నారు. స్పింక్లర్ల కోసం 55 శాతం సబ్సిడీ ఇస్తామన్నారు. ఇందు కోసం రైతులు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడీ కోరారు.

ప్రమాదాలకు కారణమవుతున్న మినీ బ్యానర్లు


రోడ్డు మధ్యలో ప్రమాదాలకు కారణమవుతున్న బ్యానర్ కర్రలు

పలమనేరు: పట్టణంలోని మెయిన్‌రోడ్డులో ఇటీవల కొందరు రోడ్డు డివైడర్‌కు ఏర్పాటు చేసిన మినీ బ్యానర్ కర్రలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. అసలే ఇరుకైన రోడ్డు కావడంతో అటువైపు, ఇటువైపు వెళ్లే బైక్‌లు, ఆటోలకు ఈ కర్రలు తగిలి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి వీటిని తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కమిషనర్ పారిశుధ్య కార్మికురాలైన వేళ..!

చిత్తూరు అర్బన్: చిత్తూరులో చేస్తున్న పారిశుద్ధ్య పనులను మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ గురువారం తనిఖీ చేశారు. 43వ డివిజన్ పరిధిలోని రంగాచారి వీధిలో కాలువ వ్యర్థాలు తొలగిస్తున్న తీరును పరిశీలించి, ఆమె కూడా కొంతసేపు ఆ పనులు చేశారు. కమిషనర్ వెంట ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.


కాలువ వ్యర్థాలు తొలగిస్తున్న కమిషనర్ అరుణ

బడిలో టీడీపీ రాజకీయం


తవణంపల్లిలో ఎన్నికలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు


పూతలపట్టులో ఎన్నికలు నిర్వహిస్తున్న అధికారులు

- చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో ఏకపక్షంగా ఎస్‌ఎంసీ ఎన్నికలు
- టీడీపీ నేతలకు వంతపాడిన టీచర్లు
- చాలాచోట్ల తల్లిదండ్రులు లేకుండానే కమిటీల ఎన్నిక

కాణిపాకం: బడిలో పచ్చరంగు పులుముకుంది. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికల్లో టీడీపీ నేతలు రచ్చరచ్చచేశారు. తమదే అధికారమని, తాము సూచించిన వారినే చైర్మన్లుగా ఎంపిక చేయాలని పట్టుపట్టారు. పాఠాలు బోధించాల్సిన ఉపాధ్యాయుల చేతులు కట్టిపడేశారు. వేలెత్తితే.. వేటు తప్పదంటూ భయపెట్టారు. తల్లిదండ్రులు లేకుండానే కమిటీ ఎన్నికలను ఏకపక్షం చేసి ముగించారు. చిత్తూరు, పూతలపట్టు నియోజకర్గాల్లో 625 ప్రాథమిక, 75 ప్రాథమికోన్నత, 122 వరకు జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం అన్ని పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. తల్లిదండ్రుల సమక్షంలో ఈ ఎన్నికలు జరగాల్సి ఉంది. చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులు నిబంధనలకు విరుద్ధంగా తల్లిదండ్రులు లేకుండానే ఏకగ్రీవం చేశారు.

ఇలా జరిగింది...

టీడీపీ నేతలు ముందస్తుగా పాఠశాలల వారిగా చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల పేర్లను ఖరారు చేసి ఉపాధ్యాయుల ముందు పెట్టారు. కొంతమంది ఉపాధ్యాయులు అభ్యంతరం తెలిపినా లెక్కచేయకుండా టీడీపీ నేతల సమక్షంలో ఎన్నికలు జరిపి వారి చెప్పిన విధంగానే కమిటీలను ప్రకటించారు. ఇంకొన్ని చోట్ల పోటీ రావడంతో తమ్ముళ్లు తిరగబడ్డారు. ఎన్నికలు ఏకపక్షంగానే జరిపించాలని భీష్మించారు. వేలెత్తే పని వస్తే వేరే బడి చూసుకోవాల్సి వస్తుందని ఉపాధ్యాయులను బెదిరింపులకు గురిచేశారు. తల్లిదండ్రులు కూడా భయపడి ఎన్నికలకు దూరమయ్యారు. మీ ఇష్టమొచ్చినట్లు చేసుకోండి అంటూ వెనుదిరిగారు. అనంతరం ఉపాధ్యాయులు టీడీపీ నేతల సమక్షంలో ఎన్నికలను ముగించారు.

మూడుచోట్ల టీడీపీ ఢీ..

అన్నిచోట్లా ఎన్నికలు ఏకపక్షంగా జరగ్గా గుడిపాల మండలంలోని శ్రీరంగపల్లి, నరహరిపేట, కమ్మతిమ్మపల్లి పాఠశాలల్లో ఎన్నికలు గోలగోలగా మారాయి. టీడీపీ నేతలే నువ్వా.. నేనా అంటూ పోటీ పడ్డారు. దీంతో అక్కడ ఎన్నికలు వాడివేడిగా సాగాయి. చివరకు తల్లిదండ్రుల సమక్షంలో ఎన్నికలు జరపడంతో ఆలస్యమైంది. తల్లిదండ్రులు ఈ ఎన్నికల గోల ఏమిటో అంటూ విస్తుపోయారు. ఉపాధ్యాయులు చేసిన పనికి తలదించుకున్నారు. బడిలో జరిగిన ఏకపక్ష రాజకీయంపై కొందరు తల్లిదండ్రులు అధికారులకు ఫిర్యాదు చేశారు.

కూలి పడేదెప్పుడు.. కడుపునిండేదెన్నడు


కేఎం కండిగలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- 10 వారాలుగా అందని కూలి నగదు
- రూ 88.32 లక్షల బకాయిలు
- ఇబ్బంది పడుతున్న ఉపాధి కూలీలు

బంగారుపాళెం: గ్రామాల్లో వలసలను నివారించడానికి కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలుచేస్తోంది. ఇందులో భాగంగా జాబ్‌కార్డులు అందజేసి కూలీలకు స్థానికంగా పనులు చూపించి ఉపాధి కల్పిస్తున్నారు. రోజుకు కనీసం రూ.300ల కూలి గిట్టుబాటు అయ్యేలా పనులు చేయిస్తున్నారు. బంగారుపాళెం మండలంలోని కూలీలకు 10 వారాలుగా కూలి నగదు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాము కుటుంబాలను ఎలా పోషించుకోవాలి అని వాపోతున్నారు. మండలంలో 12,383 మందికి ఉపాధి జాబ్ కారులున్నాయి. ఈ ఏడాది 1,687 కుటుంబాలకు 16 వారాలు పని కల్పించారు. 1,986 మంది కూలీలు పనులు చేశారు. ఇందులో 6 వారాలకు మాత్రమే ఉపాధి బిల్లులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. మే 20వ తేదీ నుంచి ఇప్పటి వరకు కూలీలకు నగదు అదలేదు. 10 వారాలకు ఉపాధి కూలీల బిల్లులు రూ 88.32 లక్షల వరకు బకాయిలున్నాయి. మండుటెండలో కష్టపడి పని చేసినా బిల్లుల రాక పోవడంతో ఎలా బతకాలని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రతి వారానికి ఉపాధి కూలీల బిల్లులు బ్యాంకు ఖాతాల్లో జమయ్యేవని కూలీలు చెబుతున్నారు. ఈ ఏడాది ఉపాధి కూలీలు పని చేసిన పనిదినాలకు ఇంకా బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంటున్నారు. దీనిపై ఏపీఎం కిరణకుమార్‌ను వివరణ కోరగా ఈ నెల 14వతేదీలోపు బకాయిలు జమ అవుతాయని ఉన్నతాధికారులు చెబుతున్నట్లు తెలిపారు.


మహాసముద్రం గ్రామంలో..

మండలంలో జాబ్‌కార్డు దారులు	12383
పనిచేసిన కుటుంబాలు	1687
పనిచేసిన కూలీలు	1986
కూలీలకు అందాల్సిన బకాయిలు	88.32 లక్షలు

హిందువులకు రక్షణ కల్పించాలి

చిత్తూరు కార్పొరేషన్: బంగ్లాదేశ్‌లోని హిందువులకు రక్షణ కల్పించాలని బీజేపీ, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం రాత్రి స్థానిక గాంధీ విగ్రహం వద్ద ఆ దేశంలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో జరుగుతున్న హింసాకాండను మీడియాలో చూస్తుంటే భయమేస్తోందన్నారు. బంగ్లాదేశ్‌లో మైనార్టీలు హిందువులను దారుణంగా హింసిస్తున్నారని తెలుస్తోందన్నారు. నేతలు చిట్టిబాబు, రామభద్ర, వెంకటేష్, పాండియన్ పాల్గొన్నారు.


శ్రద్ధాంజలి ఘటిస్తున్న నేతలు

ప్రజల ముంగిటకే వైద్యసేవలు



తెల్లగుండ్లపల్లెలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు, గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ పూర్ణలత

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రజల ఇంటి ముంగిటకే మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని తెల్లగుండ్లపల్లెలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. అదేవిధంగా కృష్ణాపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు ఆరోగ్య సూత్రాలు వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రాజామణి, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాసులు, సుబ్రమణ్యంరెడ్డి, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌ను సద్వినియోగం చేసుకోండి

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత తెలిపారు. మండలంలోని నాగంవాండ్లపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 70 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. నడవలేని స్థితిలో ఉన్న రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి వారికి పరీక్షలు చేసి సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


కృష్ణాపురంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

మౌలిక వసతులపై స్పందించండి


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: మండలంలో ప్రజలు తెలిపిన సమస్యలపై వెంటనే స్పందించి తక్షణమే పరిష్కరించడానికి అధికారులు కృషిచేయాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సూచించారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆయన మండల పలుశాఖాధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని పనులు సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పలమనేరు మెప్మాకు కొత్త సిబ్బంది

పలమనేరు: పలమనేరు పట్టణంలో డాయ్ యాప్ మోసాలకు బాధ్యులుగా సస్పెండ్ అయిన అధికారుల స్థానంలో కొత్త వారు గురువారం విధుల్లో చేరారు. ఆ మేరకు మెప్మా పీడీ రాధమ్మ ఆదేశాల మేరకు ఇక్కడి సీఎంఎంగా బాబా, సీఓగా ధనలక్ష్మి, మరో ఆపరేటర్ స్థానిక కమిషనర్‌ను సంప్రదించి విధుల్లో చేరారు. సస్పెండ్ అయిన ఆర్పీలను త్వరలో నియమించనున్నట్టు పీడీ తెలిపారు. డాయ్ యాప్ ద్వారా మెప్మాలోని సిబ్బంది కారణంగా ఇక్కడ రూ.5కోట్ల దాకా బాధితులు మోసపోయిన విషయం తెలిసిందే. ఇందుకు కారణమైన మెప్మా సిబ్బందిపై విచారించిన కమిటీ ఇచ్చిన రిపోర్ట్ మేరకు సిటీ మిషన్ మేనేజర్ ఉమేష్‌జాదవ్, ముగ్గురు కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రాజేష్ అనే డాటా ఎంట్రీ ఆపరేటర్‌తోపాటు 14మంది ఆర్పీ(రిసోర్స్‌పర్సన్లు) విధులనుంచి తొలగించిన విషయం తెలిసిందే.